teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

## హైదరాబాద్ మెట్రో రైల్ టేకోవర్



- మార్చి 31లోగా ప్రక్రియ పూర్తికి సర్కార్ కసరత్తు
- పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ బలోపేతమే లక్ష్యం
- వేగవంతమైన ఒప్పందాల దిశగా అడుగులు

02

ములుగు | సంపుటి : 04 | సంచిక : 228 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 22 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.



## పత్తి రైతులకు ఊరట

కొనుగోళ్ల గడువును పెంచిన సీసీఐ
రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి స్పందించిన కేంద్రం

.. వివరాలు 2లో



## తెలంగాణలో కొత్త కూటమి

ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయమే లక్ష్యం

జీహెచ్ఎంసీ, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధం

.. వివరాలు 2లో



## మార్చి 31 నాటికి రెడ్ టెర్రర్ నుంచి విముక్తి

దేశం నుంచి నక్సలిజం నిర్మూలనే లక్ష్యం
కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా
సీఆర్పీఎఫ్ పరేడ్‌లో ప్రకటన

.. వివరాలు 5లో





# దేశ రాజధానిలో ఉగ్ర హెచ్చరికలు

- ఎర్రకోట, ప్రముఖ ఆలయాలే లక్ష్యంగా కుట్ర
- ఇంటెలిజెన్స్ హై అలర్ట్
- రంగంలోకి దిగిన భద్రతా దళాలు

2

దేశరాజధాని ఢిల్లీలో ఇంటిలిజెన్స్ అలర్ట్ ప్రకటించింది. ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్లకు ఎల్‌ఈటీ ఉగ్రవాదులు కుట్ర పన్నినట్టు తెలిపింది. పాకిస్థాన్ మసీద్ వద్ద ఇటీవల జరిగిన పేలుళ్లకు ప్రతీకారం తీర్చుకునేందుకు ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని నిఘావర్గాలు చెబుతున్నాయి.

## ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం
# 1100 ఫైల్స్ దగ్ధం

- డేటా రికవరీ అసాధ్యమని తేల్చిన నాగ్‌పూర్ టీమ్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఊహించని మలుపు
- శాస్త్రీయ సాక్ష్యాధారాలు లభ్యం కావడం కష్టమే




02

## దేశవ్యాప్తంగా 32 నకిలీ విశ్వవిద్యాలయాలు




02

## పోలీసింగ్‌లో యువత భాగస్వామ్యం



- హైదరాబాద్ సిటీ పోలీస్ సరికొత్త నిర్ణయం
- విద్యార్థుల కోసం 'ఇంటర్న్‌షిప్' ప్రోగ్రామ్
- అర్హతలు మరియు ప్రయోజనాలు

05

## డిజిటల్ అరెస్ట్ మాయాజాలం



- ఆలోచనా శక్తిని హ్యాక్ చేస్తున్న నేరగాళ్ళు
- 72 లక్షలు కాపాడినా.. మళ్ళీ 49 లక్షలు సమర్పించుకున్న బాధితుడు
- సీపీ సజ్జనార్ ఆవేదన

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): సైబర్ నేరగాళ్ల సైకలాజికల్ బ్రెయిన్ వాష్‌కు ఇదొక సజీవ ఉదాహరణ అంటూ హైదరాబాద్ నగర్ కమిషనర్ సజ్జనార్ ఓ వార్తను పోస్ట్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం తన సోషల్ మీడియా ఖాతా వేదికగా ఆ వార్తను షేర్ చేశారు. ఈ వార్త చదివితే ఆశ్చర్యంతో పాటు

మిగతా 2 లో




## కాంగ్రెస్‌లో మెరిట్ కోటా తప్ప మరే కోటా లేదు

- డీసీసీ అధ్యక్షుల శిక్షణలో సీఎం రేవంత్ రెడ్డి
- గాంధీ సిద్ధాంతాలే పార్టీకి దిక్సూచి
- క్షేత్రస్థాయిలో డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలి

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 21,(తీన్మార్ న్యూస్): రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి

మిగతా 5 లో

## చంచల్‌గూడ జైలులో ఉగ్రకుట్ర అవాస్తవం



- జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా స్పష్టత
- లష్కరే తోయిబా కుట్ర ఆరోపణలు నిరాధారమని వెల్లడి
- భయాందోళనలు వద్దు
- అసత్య ప్రచారాలపై డీజీ సీరియస్

02

## ఇండ్లను మంజూరు చేయాలి

కేంద్ర మంత్రి చౌహాన్‌కు పొంగులేటి వినతి
పీఎంఏవై-జీలో చేరిన తెలంగాణ
పేదల సొంతింటి కలపై ఆశాభావం



05

## అంతర్జాతీయ వేదికపై రాజకీయ నాటకాలా..?

కాంగ్రెస్ మూర్ఖత్వం కృత్రిమ మేధస్సును మించిపోయింది
ఏఐ సమ్మిట్ నిరసనలపై కేటీఆర్ ధ్వజం
ప్రపంచ దేశాల ముందు ప్రతిష్ట దెబ్బతింటుందని ఆవేదన



# దేశ రాజధానిలో ఉగ్ర హెచ్చరికలు






న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): దేశరాజధాని ఢిల్లీలో ఇంటిలిజెన్స్ అలర్ట్ ప్రకటించింది. ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్లకు ఎల్ఈటీ ఉగ్రవాదులు కుట్ర పన్నినట్టు తెలిపింది. పాకిస్థాన్ మసీద్ వద్ద ఇటీవల జరిగిన పేలుళ్లకు ప్రతీకారం తీర్చుకునేందుకు ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని నిఘావర్గాలు చెబుతున్నాయి. దేవాలయాల వద్ద పేలుళ్లకు కుట్ర చేస్తున్నారని హెచ్చరిస్తున్నాయి. ఎర్రకోట, చాందినీ చౌక్ లోని ఆలయాల వద్ద పేలుళ్లు జరగవచ్చని హెచ్చరికలు జారీ చేశాయి. అంతే కాకుండా ఢిల్లీలోని ఈ ప్రాంతాల్లో బలగాలు మోహరిచండంతో పాటు, వీవీఐపీ ప్రాంతాల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఇదిలా ఉంటే గురువారం పలు రాష్ట్రాల్లోని కోర్టులు, స్కూళ్లను లక్ష్యంగా చేసుకుని బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యారు. బంగ్లాదేశ్ సర్వర్ల నుండి నకిలీ బెదిరింపు ఈమెయిల్స్ వచ్చినట్టు గుర్తించారు. ఈ క్రమంలో ఢిల్లీలోని మూడు సీఆర్పీఎఫ్ పాఠశాలలకు సైతం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఉదయమే మెయిల్స్ రావడంతో విద్యార్థులను ఇంటికి పంపించి తనిఖీలు నిర్వహించారు. అయితే ఈ సోదాలలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కానీ పేలుడు పదార్థాలు కానీ దొరకలేదు.

## చంచల్‌గూడ జైలులో ఉగ్రకుట్ర అవాస్తవం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): చంచల్ గూడ జైల్లో ఇటీవల నిర్వహించిన ములాఖత్ లో పేలుళ్లకు ప్లాన్ రచించినట్లుగా నిఘావర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు వస్తున్న వార్తలను జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా ఖండించారు. ఉగ్రకుట్రకు ప్లాన్ చేస్తున్నారని వస్తున్న వార్తల్లో నిజంలేదని, అదంతా అవాస్తవమని స్పష్టం చేశారు. ఈ అసత్య వార్తలను కొన్ని మీడియా ఛానళ్లు, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో స్ప్రెడ్ చేస్తున్నారని, ప్రజలను ఇలాంటి వార్తలతో భయాందోళనలకు గురిచేయవద్దని కోరారు. లష్కరే తోయిబా ఉగ్రసంస్థకు చెందిన ఉగ్రవాది జైల్లో ప్రణాళికలు రచించినట్లుగా నిఘావర్గాలు ఆరోపిస్తున్నాయని శుక్రవారం నుంచి వార్తలు వైరల్ అవుతున్నాయి. ముసారాంబాగ్, సైదాబాద్, మలక్ పేటలో పోలీసులు నిఘా పెంచారని, అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల్ని ప్రశ్నిస్తున్నారని వాటి సారాంశం. అయితే ఈ వార్తలతో హైదరాబాద్ ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వైరల్ అవుతున్న వార్తలపై జైళ్ళశాఖ డీజీ సౌమ్య మిశ్రా స్పష్టతనిచ్చారు.



## డిజిటల్ అరెస్ట్ మాయాజాలం

మొదటి పేజీ తరువాయి

బాధ కూడా కలుగుతోందని ఆవేదన చెందారు. 65 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగిని 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సైబర్ నేరగాళ్లు బెదిరించారని తెలిపారు. మొదటిసారి ఆయనను అదృష్టవశాత్తూ బ్యాంక్ సిబ్బంది, పోలీసులు ఆపి సైబర్ మోసగాళ్ల ఖాతాలను చూపించి మరీ అవగాహన కల్పించి రూ.72 లక్షలు కాపాడారని వెల్లడించారు. కానీ విచిత్రం ఏంటంటే 15 రోజుల తర్వాత మళ్లీ అదే గ్యాంగ్ కాల్ చేస్తే, ఆ పెద్దాయన పోలీసుల కంటే ఆ మోసగాళ్లనే ఎక్కువగా నమ్మాడు అని పేర్కొన్నారు. బ్యాంక్ వాళ్ళకి అబద్ధాలు చెప్పి మరీ రూ.49 లక్షలు వాళ్లకు సమర్పించుకున్నాడని వెల్లడించారు. చదువుకున్న వాళ్లు, లోకజ్ఞానం ఉన్నవాళ్లు కూడా ఇలా ఎందుకు మోసపోతున్నారు? ఎందుకంటే సైబర్ క్రిమినల్స్ ముందుగా మీ అకౌంట్‌ను కాదు, మీ ఆలోచనా శక్తిని హ్యాక్ చేస్తున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో వాళ్లు ఆడుతున్న మైండ్ గేమ్‌కు ఈ ఘటనే సజీవ సాక్ష్యం అని సజ్జనార్ వివరించారు.



### దయచేసి ఇవి గుర్తుంచుకోండి

- 'డిజిటల్ అరెస్ట్' అనే పదం మన చట్టాల్లోనే లేదు!
- సీబీఐ, ఈడీ, పోలీసుల పేరుతో ఏ దర్యాప్తు సంస్థ వాట్సాప్ లేదా స్కైప్ వీడియో కాల్స్ చేసి విచారించదు.
- కేసు మాఫీ చేస్తామని ఏ నిజమైన అధికారులు డబ్బులు అడగరు. అలా అడిగారంటే వాళ్లు 100% సైబర్ క్రిమినల్స్ అని ఫిక్స్ అయిపోండి.
- మీ పేరిట ఉన్న పార్సిల్స్ పట్టుబడ్డాయని, మనీ లాండరింగ్ జరిగిందని కాల్ రాగానే భయపడకండి. నేను తప్పు చేయనప్పుడు నాకెందుకు భయం? అని వెంటనే కాల్ కట్ చేయండి.
- ఇలాంటి బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే 1930 కి కాల్ చేయండి లేదా దగ్గర్లోని పోలీసులను ఆశ్రయించండి.
- దయచేసి అప్రమత్తంగా ఉండండి మీ ఇంట్లోని పెద్దలకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఈ విషయాన్ని వివరించి వారిలో అవగాహన కల్పించండని ట్వీట్‌లో సీపీ సజ్జనార్ వివరించారు.

## దేశవ్యాప్తంగా "32 నకిలీ విశ్వవిద్యాలయాలు"

**చెల్లని డిగ్రీలు - విద్యార్థులకు కేంద్ర విద్యాశాఖ హెచ్చరిక**

**ఢిల్లీలో అత్యధికంగా 12 సంస్థలు**

**తెలుగు రాష్ట్రాల్లోనూ నకిలీ వర్సిటీల జాబితా**

**యూజీసీ సంచలన ప్రకటన**

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, భారతదేశం అంతటా 32 నకిలీ విశ్వవిద్యాలయాలుగా పనిచేస్తున్నట్లు గుర్తించింది. అవి జారీ చేసే డిగ్రీలు ఉపాధి, ఉన్నత విద్యకు చెల్లవని హెచ్చరించింది. ఢిల్లీలో అత్యధికంగా 12 సంస్థలు ఉన్నాయి, తరువాత ఉత్తరప్రదేశ్, ఇతర రాష్ట్రాలు ఉన్నాయి. అడ్మిషన్ కంటే ముందు సంస్థల గుర్తింపు స్టేటస్ ను ధృవీకరించాలని విద్యార్థులను కోరారు. ఈ సంస్థలు కేంద్ర ప్రభుత్వం లేదా ఏ రాష్ట్ర ప్రభుత్వం నుండి గుర్తింపు పొందలేదని కమిషన్ పేర్కొంది. యూజీసీ చట్టంలోని సెక్షన్లు 2(ట), 3లను ఉటంకిస్తూ, ఈ సంస్థలు జారీ చేసే డిగ్రీలకు చట్టపరమైన చెల్లుబాటు లేదని నోటీసు నొక్కి చెప్పింది.




### రాష్ట్రాల వారీగా నకిలీవిగా ప్రకటించిన సంస్థల జాబితా (ఫిబ్రవరి 2026 నాటికి)

**ఆంధ్రప్రదేశ్ (2)**

- క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, గుంటూరు
- బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం

**అరుణాచల్ ప్రదేశ్**

- ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్

**ఢిల్లీ**

- ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం యొక్క ప్రపంచ శాంతి
- ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ ఇంజనీరింగ్
- ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ڇ ఫిజికల్ హెల్త్ సైన్సెస్ రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయం
- కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్.
- ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం,
- వృత్తి విద్యా విశ్వవిద్యాలయం,
- ADR-సెంట్రిక్ జురిడికల్ విశ్వవిద్యాలయం,
- ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్,
- స్వయం ఉపాధి కోసం విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ,
- ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయ (ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం),
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్,
- మౌంటైన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ & టెక్నాలజీ

**హర్యానా**

- మ్యాజిక్ & ఆర్ట్ విశ్వవిద్యాలయం, ఫరీదాబాద్

**జార్ఖండ్**

- దక్ష విశ్వవిద్యాలయం (వృత్తి మరియు జీవిత నైపుణ్య విద్య), రాంచీ

**కర్ణాటక**

- సర్వ భారతీయ శిక్షా పీఠ్, తుమకూరు
- గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ, బెంగళూరు

**కేరళ**

- ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ ప్రొఫెటిక్ మెడిసిన్, కోజికోడ్
- సెయింట్ జాన్స్ విశ్వవిద్యాలయం

**మహారాష్ట్ర**

- రాజా అరబిక్ విశ్వవిద్యాలయం, నాగ్‌పూర్
- నేషనల్ బ్యాక్‌వర్డ్ క్రుషి విద్యాపీఠ్, షోలాపూర్

**పుదుచ్చేరి**

- ఉషా లచ్చుమనన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్
- శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్

**రాజస్థాన్**

- రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ڇ మేనేజ్మెంట్, భివాడి

**ఉత్తర ప్రదేశ్**

- గాంధీ హిందీ విద్యాపీఠం, ప్రయాగ్‌రాజ్
- నేతాజీ సుభాష్ చంద్రబోస్ విశ్వవిద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ), అలీఘర్
భారతీయ శిక్షా పరిషత్, లక్నో
- మహామాయ సాంకేతిక విశ్వవిద్యాలయం, నోయిడా

**పశ్చిమ బెంగాల్**

- ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, కోల్కతా
- ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ అండ్ రీసెర్చ్, కోల్కతా

## ఫోరెన్సిక్ ల్యాబ్ లో అగ్నిప్రమాదం 1100 ఫైల్స్ దగ్ధం




హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ అగ్నిప్రమాద కేసులో కీలక పరిణామం చేటుచేసుకుంది. తాజాగా ఈ అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఫైల్స్ పై నాగ్ పూర్ స్పెషల్ టీమ్ కీలక ప్రకటన చేసింది. మొత్తం 1100 ఫైల్స్ దగ్ధమైనట్లు గుర్తించామని పేర్కొంది. దగ్ధమైన ఫైల్స్ ను రికవరీకి ప్రయత్నించామని, డేటా రికవరీ చేయడం సాధ్యం కాదని తేల్చేసింది. ఫిబ్రవరి 7వ తేదీన నాంపల్లిలోని ఎఫ్ఎస్ఎల్ భవనం మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం జరగ్గా 50 కంప్యూటర్లు, తీవ్రమైన నేరాల్లో పోలీసులు సేకరించిన సాంకేతిక ఆధారాలను పొందుపరిచి సీజ్ చేసిన హార్డ్ డిస్కులు దగ్ధమైనట్లు నాగ్ పూర్ స్పెషల్ టీమ్ రిపోర్టులో తెలిపింది. దగ్ధమైన ఫైల్స్ లో ఒక కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలు కూడా కాలి బూడిదైనట్లు సమాచారం. దగ్ధమైన ఫైల్స్ లో ఏమేమి ఉన్నాయన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ రాష్ట్రంలో జరిగే నేర పరిశోధనకు సహాయం అందిస్తుంది. హత్యలు, దోపిడీలు, లైంగిక దాడులు, మోసాలు వంటి కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలు అక్కడే ఉంటాయి. ఎక్కడ ఏ నేరం జరిగినా అక్కడ సేకరించిన నమూనాలు, సాంకేతిక ఆధారాలను ఈ ల్యాబ్ కే తరలించి పరీక్షిస్తారు. ఫింగర్ ప్రింట్స్, బ్లడ్, హెయిర్, డీఎన్ఏ టెస్టులు చేస్తారు. తుపాకులు, బుల్లెట్లతో పాటు విషాలు, మత్తుపదార్థాలు, గంజాయి, డ్రగ్స్, హెరాయిన్, సంతకాలు, నకిలీపత్రాల పరిశీలన కూడా చేస్తారు.

## పత్తి రైతులకు ఊరట

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని పత్తి రైతులకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తీపికబురు చెప్పింది. కొనుగోళ్లను పొడిగించింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగిస్తూ సీసీఐ తాజాగా నిర్ణయం తీసుకుంది. మంత్రి ఆదేశాలతో శుక్రవారం వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ, కేంద్ర జౌళి శాఖకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం, సీసీఐ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. కాగా రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మంత్రి తుమ్మల కోరిన సంగతి తెలిసిందే.

## తెలంగాణలో కొత్త కూటమి



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాలు రోజు రోజుకు ఆసక్తిగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఒకరిపై మరొకరు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్న వేళ ఈ మూడు పార్టీలకు చెక్ పెట్టాలంటూ రాష్ట్రంలో మరో రాజకీయ కూటమి ఏర్పాటు కావడం ఆసక్తిని రేపుతోంది. తెలంగాణ రాజకీయ కూటమి పేరుతో తాజాగా ఓ కూటమి ఏర్పాటైంది. శనివారం ఈ కూటమి భాగస్వాములైన వివిధ పార్టీల ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో త్వరలో రాబోయే జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఆవశ్యకతపై వక్తలు మాట్లాడారు.

### ప్రధాన పార్టీలతో విరక్తి:

ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని చాలా మంది ఇదే కోరుకుంటున్నారని చెప్పారు. అయితే దీనికి సరైన ప్రయత్నం జరగడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలతో ప్రజలు విరక్తి చెందారని ప్రత్యామ్నాయ రాజకీయాల్లో భాగంగా కలిసి వచ్చే వారితో ముందుకు సాగాలని నిర్ణయించారు. ప్రత్యామ్నాయం విషయంలో ఎన్నడూ సీపీఐ, సీపీఎం, ఎంఐఎం కలిసి రావు. కానీ గ్రామాల్లో ఉన్న మార్క్సిస్ట్- లెనినిస్ట్ సిద్ధాంతాల పట్ల సానుకూల దృక్పథంతో ఉన్న వారు అనేక మంది ఉన్నారని అలాంటి వారిని విద్యార్థుల సంఘాలు, రిటైర్డ్ సంఘాలతో పాటు వివిధ సంఘాలను కలుపుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు.

### తెలంగాణకు ఓ ఫిలాసఫీ:

ఈ సమావేశంలో తెలంగాణ విఠల్ మాట్లాడుతూ తెలంగాణలో పోరాటాలు జరుగుతున్నాయి తప్ప న్యాయం జరగడం లేదని తెలంగాణకు సరిపడే రీతిలో ఒక రాజకీయ ఫిలాసఫీ రూపొందాల్సిన అవసరం ఉందన్నారు. అధికారం కోసం ప్రధాన పార్టీలకు సిద్ధంతాలు, ఐడియాలజీ, మేనిఫెస్టోలు అంటూ ఏవి లేవని ప్రతిసారి బాధితుడే నష్టపోతున్నాడని చెప్పారు. 40-50 ఏళ్లు రాజకీయం చేసిన వారికి రాజకీయాలే తెలియని ప్రశాంత్ కిశోర్ లాంటి బ్రోకర్లు కన్సల్టెంట్లుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణలోని సబ్బండ వర్గాల్లోని మేధావులు, రచయితలు, కళాకారులు ఎవరి డప్పు కొట్టవద్దు. మన డప్పు మనమే కొట్టుకుందామని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కూటమిగా ఏర్పడి రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ లక్ష్మణ్, తెలంగాణ విఠల్, ప్రొ.గాలి వినోద్, రాష్ట్రీయ లోక్ దళ్ తెలంగాణ అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రో రైల్ టేకోవర్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మెట్రో రైల్ టేకోవర్ ప్రక్రియను ఈ ఆర్థిక సంవత్సరాంతానికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మెట్రో టేకోవర్ కోసం ప్రభుత్వం టెక్నికల్ కన్సల్టెంట్‌గా ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్ (డీఎంఆర్సీ), ఫైనాన్స్, లీగల్ అడ్వైజర్ గా ఐడీబీఐని ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. అయితే ఫైనాన్స్, లీగల్ అంశాల్లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చేయడానికి ఐడీబీఐ సంస్థ స్టడీ చేసింది. ఎల్ అండ్ టీ సంస్థకు ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన బకాయిలు, ఇతర అంశాలకు సంబంధించిన రిపోర్టు రూపొందించడంతోపాటు ప్రభుత్వానికి అధికారులు అందజేశారు. దీని ఆధారంగానే హెచ్ఎంఆర్ఎల్, ఎల్అండ్ టీ సంస్థలు చర్చించుకుని ఒప్పందాలపై సంతకాలు చేసుకునే అవకాశముంది. ఈ నెల 23న జరిగే కేబినెట్ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. దీన్ని కేబినెట్ ఆమోదించిన వెంటనే టేకోవర్ ప్రక్రియ మరింత వేగవంతం చేసే అవకాశాలున్నాయి. మార్చి 31లోగా మెట్రోరైలు ప్రాజెక్టు టేకోవర్ చేసుకోవడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది.

# కాంగ్రెస్‌లో చేరిన 5వ వార్డు కౌన్సిలర్ గొడుగు రజిత నాగరాజ్



పరకాల, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): శనివారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు బిఆర్ఎస్ పార్టీ 5వ వార్డు కౌన్సిలర్ గొడుగు రజిత నాగరాజ్ పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు.

# పేదవాడి ఆత్మగౌరవ ప్రతీకలు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

**పేదల కళ్ళలో ఆనందం నింపడమే ప్రభుత్వ లక్ష్యం**



సంగెం, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): సంగెం మండలం కొత్తగూడెం గ్రామంలో నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం సంగెం మండలం కొత్తగూడెం గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని, రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వీట్ తినిపించి, శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.

# రైతుబడి అగ్రి షోలో భూపాలపల్లి రైతుల సందర్శన



భూపాలపల్లి, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): శనివారం భూపాలపల్లి, కాటారం డివిజన్ పరిధిలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎ. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో 50 మంది రైతులను హైదరాబాద్‌లో జరుగుతున్న రైతుబడి అగ్రి షోకు తీసుకువెళ్లారు. ఈ అగ్రి షోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను రైతులు సందర్శించి, వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న ఆధునిక పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ విధానాలపై అవగాహన పొందారు. ముఖ్యంగా వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం, ఆధునిక టెక్నాలజీ, స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్స్, విత్తనాలు ఎంపిక, ఎరువుల వినియోగ విధానాలు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే సాంకేతిక పద్ధతులను పరిశీలించారు. వ్యవసాయంలో వినియోగిస్తున్న వివిధ యంత్రాలు, పరికరాలు, పంట సంరక్షణలో ఉపయోగించే డ్రోన్లు, విత్తన కంపెనీల ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు నూతన సాంకేతికతను తమ పంటల్లో అమలు చేయాలనే ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎ. సునీల్ కుమార్ మాట్లాడుతూ, రైతులు ఆధునిక సాంకేతికతను అవలంబిస్తే తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఇలాంటి అగ్రి షోలలో పాల్గొనడం రైతులకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహాదేవ పూర్ ఉద్యాన అధికారి వై. మణి, విస్తరణ అధికారి రామ్ దాస్, వివిధ గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్.జి**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): శనివారం కన్నాయిగూడెం దేవాదుల ప్రాజెక్ట్ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, జిల్లా ఇంచార్జ్ ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి పరిశీలించారు. ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కన్నాయిగూడెం దేవాదుల ప్రాజెక్ట్ పరిశీలన పర్యటన సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రాజెక్ట్ ఆవరణలో అధికారుల సమావేశ ప్రాంతాన్ని , హెలిపాడ్, గోదావరి నది వ్యూ పాయింట్ ను పరిశీలించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఇర్రిగేషన్ఈ ఈ శంకరయ్య, నారాయణ, ఆర్ డి ఓ వెంకటేష్, డి పి ఓ వెంకయ్య ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలు

**వేసవిలో కూరగాయల సాగు లాభదాయకం**

**జిల్లాలో రోజు పెరుగుతున్న కూరగాయల విస్తీర్ణం**




మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): మనము రోజు వారీగా తినే కూరగాయలను ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, పెరటిలో, ఇంటిముందు, పొలం గట్ల మీద, ప్రతి ఖాళీ స్థలంలో నాణ్యమైన ఎలాంటి పురుగుమందులు లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా మన కూరగాయలను మనమే పండించుకుందాం క్యాన్సర్ లేని సమాజమే మన లక్ష్యం తేదీ: 21.02.2026, శనివారం నాడు జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి, మహబూబాబాద్, మహబూబాబాద్ మండలంలోని పలు గ్రామాలలో సాగులో ఉన్న ఆయిల్ పామ్, మిరప, కూరగాయలు, మొదలైన పంటలు పరిశీలించి పలు మేలైన యాజమాన్య పద్ధతులు రైతులకు తెలిపినారు. ఈ సీజన్ అయిన వేసవిలో వంగ, దోస, సొర, గోరు చిక్కుడు, బెండ, ఆకు కూరలు, మునగ మరియు షేడ్ నెట్స్ క్రింద టమాట, కీర మొదలైన మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు ద్వారా ఎకరానికి యాభై వేల వరకు ఆదాయం వస్తుంది. పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని రైతులకు తెలిపినారు. కూరగాయల సాగులో నూతన, ఆధునిక పద్ధతులు పాటించుట, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలి. సాగు–షేడ్ నెట్ లలో, ట్రెల్లిస్, ఎగబాకించే పద్ధతి, పందిరి సాగు మొదలైన నూతన ఆధునిక పద్ధతులు. రైతులు నిత్యం ఆదాయం ఇచ్చే కూరగాయల పంటల సాగు వైపు మరలాలి. జిల్లాలో 5 వేల ఎకరాల పై చిలుకులో కూరగాయల సాగు చేస్తున్నారు. రైతులు కూరగాయల సాగుకు పలు రాయితీలు ఎకరానికి రూ.2100/- అంతర పంటల సాగుకు, కూరగాయల శాశ్వత పందిరి నిర్మాణానికి ఎకరానికి లక్ష రూపాయల రాయితీ మరియు ఎకరానికి రూ.10,000/- కూరగాయల నారు మొక్కలను సరఫరా రాయితీ సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుహాసిని హార్టీకల్చర్ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల, ఉద్యాన విస్తరణ అధికారి బి. రమేష్, ఆగస్టీన్, సర్పంచ్ ఇస్లావత్ శంకర్ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు మొదలైనవి సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రో ట్రే లో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలి.

# ఉపాధి హామీ పథకం ప్రగతిపై సమీక్షా



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): జిల్లాలో అమలవుతున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ప్రగతి పై శనివారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం అమలులో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లేబర్ బడ్జెట్ లక్ష్యము సాధించడంలో వెనుకబడిన మండలాలు వారం రోజులలోపు ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీల సమీకరణ ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి భాధ్యత అని ఈ విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అలసత్వం వహించరాదని అదేవిధంగా అన్ని గ్రామాలలో నిర్వహించబడుతున్న నర్సరీ లలో 100 శాతం బ్యాగ్ ఫిల్లింగ్ మరియు విత్తనాల డిబ్లింగ్ జరగాలని ఈ విషయంలో సంబంధిత మండల పంచాయతీ అధికారి మరియు మండల పరిషత్ అధికారి మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తగు శ్రద్ధ వహించాలని అన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం క్రింద మంజూరి చేయబడి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టబడిన పనులన్నీ వెంటనే మొదలుపెట్టాలని మరియు ఇప్పటికే పూర్తయిన పనులన్నింటినీ ఆన్లైన్లో కంప్లీట్ అని చూపించాలని అందరూ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లను ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లను మరియు జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మధుసూదన్ రాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ అధికారి నిర్వాహక ఇంజనీర్లు సహాయ కార్యనిర్వాయక ఇంజనీర్ మండలాల నుండి ప్రోగ్రాం అధికారులు మండల అభివృద్ధి అధికారి మండల పంచాయతీ అధికారులు మరియు అదనపు ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన సర్పంచ్



కొత్తపల్లి గోరి, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలం లోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుంది. దానిలో భాగంగా విద్యార్థుల శ్రేయస్సుకోసం గ్రామ సర్పంచ్ జవ్వాజి రమేష్ ముదిరాజ్ విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం పెడుతున్నారా లేదా అని పాఠశాల ప్రధానోపాధ్యాయులుని అడిగి తెలుసుకున్నారు. అలాగే నాణ్యమైన బియ్యం కూరగాయలు నాణ్యతగా ఉన్నాయా లేవా అని పరిశీలించడం జరిగింది. పాఠశాలలో విద్యార్థుల కు మెనూ ప్రకారంగా ఖచ్చితంగా భోజనం పెట్టాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులుని కోరడమైనది. పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం వలన దానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల యొక్క హాజరు శాతాన్ని పెంచాలని ప్రధానోపాధ్యాయులను కోరడమైనది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, విద్యార్థులయొక్క తల్లిదండ్రులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తిపాకలో సైబర్ నేరాల పట్ల అవగాహన

**పెన్షన్ ఆగిపోయింది.. ఇప్పిస్తామని మోసాలు**

**ఉచితంగా డబ్బులు వస్తాయి అంటే నమ్మకండి**

**జక్కుల పరమేశ్వర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్**



శాయంపేట, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల మరియు ఆర్థిక క్రమశిక్షణ పట్ల అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి మారపల్లి క్రాంతి కుమార్ సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా జక్కుల పరమేశ్వర్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మరియు సర్పంచ్ ఐలయ్యలు హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియోల ద్వారా, మరియు ఆన్లైన్ మోసాలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోయి ఏది నిజం ఏది అబద్ధం అని తెలుసుకోలేక ప్రజలు అయోమయంలో ఉంటున్నారు.

వీటికి తోడుగా వాట్సాప్ గ్రూప్ లలో వచ్చే అపరిచిత లింకుల ద్వారా ఉచితంగా డబ్బులను సంపాదించవచ్చు అని మెసేజ్ లు రావడంతో వాటి ఆ లింకులను ఓపెన్ చేసి నష్టపోయిన వారు చాలామంది ఉన్నారు. అదేవిధంగా ఎటువంటి పూచి కత్తు లేకుండా లోన్స్ ఇస్తామని ఈ లింకులను ఓపెన్ చేయండి అని అనడంతో ఈ విధంగా కూడా చాలామంది నష్టపోయిన వారు ఉన్నారు, మరియు అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం, మరియు అనధికార లింకులను ఓపెన్ చేయడం వల్ల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి, అంతేకాకుండా ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా మనకు డబ్బులు పంపించి, మనకు డబ్బులు పడినట్టు మెసేజ్ లు కూడా వచ్చి ఆ డబ్బులు పొరపాటున మీకు వచ్చాయి దయచేసి మా ఈ నెంబర్ కి తిరిగి పంపండి అని అనడంతో, అలా పంపించడం ద్వారా కూడా చాలామంది డబ్బులు పోగొట్టుకున్న వారు ఉన్నారు. కాబట్టి వీటన్నింటి నుండి జాగ్రత్త పడాలంటే అపరిచిత వ్యక్తులు పంపించిన లింకులను ఓపెన్ చేయవద్దు, ఓటిపి ఎవరికీ చెప్పవద్దు, లింకుల ద్వారా ఎవరికీ డబ్బులు పంపించవద్దు, అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామఉప సర్పంచ్ రాజు, కుమారస్వామి, మారపల్లి విజయ్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

## వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్క నూర్ లో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ సందర్శించారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల ప్రజల కోసం స్థానిక మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. మెగా వైద్య శిబిరంలో ఓపి నమోదు, ప్రాథమిక పరీక్షల కౌంటర్లను, కలెక్టర్ పరిశీలించారు. జనరల్ ఫిజీషియన్ విభాగాలతోపాటు ఎముకలు, శస్త్ర చికిత్స, పిల్లలు, చెవి ముక్కు గొంతు, చర్మవ్యాధి, కంటి, స్త్రీ వైద్య నిపుణులు వైద్య సేవలను, ఈసీజీ మరియు ఎక్సరే పరీక్షలు నిర్వహిస్తుండగా కలెక్టర్ సందర్శించి ఆయా విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ కౌంటర్ ను కలెక్టర్ సందర్శించి అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే హాజరైన సర్పంచులను వారి వారి గ్రామాల నుండి ఎంతమంది ఏ సమస్యలతో రావడం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. జనగామ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రి జనగామకు చెందిన (8 )విభాగాల నుండి స్పెషలిస్ట్ వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ముల్కనూర్ ,వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని డాక్టర్లు ఏఎన్ఎంలు, ఆశాలు, మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామ కార్యదర్శులు సంబంధిత గ్రామ ప్రజలను గుర్తించి శిబిరానికి పంపించగా వివిధ విభాగాల వైద్యులు పరీక్షించారు. ఈ శిబిరంలో 14 మంది స్పెషలిస్ట్ వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుండి డాక్టర్లు సూపర్వైజర్లు,ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు, రేడియోగ్రాఫర్లు పారామెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు మొత్తం (75) మంది పాల్గొన్నారు. అలాగే ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాల పట్ల, ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి బీపీ తో పాటు అవసరమైన వారికి షుగర్ , హిమోగ్లోబిన్ పరీక్షలను అక్కడే నిర్వహించగా ఇతర ల్యాబ్ పరీక్షలకు నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ లో పరీక్షల నిమిత్తం పంపించారు. ప్రత్యేకంగా మొబైల్ ఎక్రే మరియు ఈసీజి ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని , స్థానికంగా అందుతున్న వైద్యంతో పాటు, స్పెషలిస్ట్ వైద్య సేవలు అవసరం ఉండి పనుల ఒత్తిడి వల్ల అలాగే వైద్య పరీక్షలకుటెస్టులకు అదనంగా డబ్బులు వెచ్చించలేక పట్టణాలకు వెళ్లలేక పోతున్న వారి కోసం మండల కేంద్రంలో వారికి అందుబాటులో వైద్య సేవలు అందించాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో (310)మందికి ఒక్కరికి దాదాపుగా 1800 రూపాయల విలువైన ల్యాబ్ పరీక్షలు చేయడం జరిగింది. 5 లక్షల పైగా విలువచేసే మందులను పంపిణీ చేయడం జరిగింది. డి ఎం హెచ్ ఓ విజ్ఞప్తి మే-రకుజిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మృత్యుంజయ రెడ్డి దాదాపుగా ఒక లక్షరూపాయల విలువైన మందులు అందించడం జరిగింది. మొత్తం వైద్య శిబిరంలో ( 863)వైద్య సేవలు అందుకోగా అందులో జనరల్ మెడిసిన్ (. 284)ఎముకలవైద్యానికి సంబంధించి ( 143)పిల్లలకు సంబంధించిన సమస్యలు ( 93)చర్మవ్యాధి సమస్యలు ( 44)చెవి ముక్కు గొంతు సంబంధిత సమస్యలు ( 49)జనరల్ సర్జరీ ( 26)స్త్రీలకు సంబంధించిన సమస్యలు(. 34)కంటి సమస్యలకు (190)చికిత్స అందించడం జరిగింది. అలాగే మరింత మెరుగైన పరీక్షలు చికిత్స నిమిత్తం (12 ) మందిని ఎంజీఎం ఆసుపత్రి, జిఎంహెచ్ లకు (18) క్యాటరాక్ట్ ఆపరేషన్ నిమిత్తంలరిఫర్ చేయడం జరిగింది.

89 ) ఎక్స్ రే మరియు (40) ఈసీజీ పరీక్షలు. లాబ్ పరీక్షలు (310)నిర్వహించడం జరిగిందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య తెలియజేశారు. దృష్టిలోపాలున్న (54) మంది కి పెద్ది వసంత ఫౌండేషన్ ద్వారా అద్దాలు అందజేయడం. జరుగుతుందని శ్రీ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య, స్థానిక సర్పంచ్ శ్రీ. ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీ. కే.మమత, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శ్రీ పెద్ది వెంకటనారాయణ గౌడ్, వంగర సర్పంచ్ గజ్జల సృజన రమేష్, ఎర్రబెల్లి సర్పంచ్ కాలేరు శ్రవణ్ విశ్వనాథ కాలనీ సర్పంచ్ కస్తూరి సుధాకర్, ధర్మారం సర్పంచి గోపగోని తిరుపతి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, స్థానిక తహసిల్దార్ రాజేష్ ఎంపీడీవో వీరేశం ,జనగామ నుండి డాక్టర్ డాక్టర్ సంజీవయ్య,. డాక్టర్ హైమావతి డాక్టర్ సుప్రియ, డాక్టర్ శ్వేత డాక్టర్ మానస్, డాక్టర్ ఉదయ్. డాక్టర్ సుష్మ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ వర్షిణి, ముల్కనూరు, వంగర ఎల్కతుర్తి వైద్యాధికారులు డాక్టర్ స్వప్న, డాక్టర్ రెహమాన్, డాక్టర్ రాజశేఖర్ , డాక్టర్ భార్గవ్ డాక్టర్ సురేష్, పల్లెదవ ఖానా వైద్యాధికారులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీ రెహమాన్, డెమో వి అశోక్ రెడ్డి, ఎజూలువరాజేశ్వర్ రెడ్డి మోహన్,అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన, పంచాయతీరాజ్ శాఖ, మిషన్ భగీరథ అధికారులతో కలిసి జిల్లా తాగునీటి వేసవి ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యుఎస్ ఇంజినీర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో సరఫరాపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో జిల్లాలోని 698 హ్యాబిటేషన్లలో నివసిస్తున్న 1,16,934 కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్లా కనెక్షన్లు లేని 1784 గృహాలకు వెంటనే కనెక్షన్లకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రోజుకు 100 లీటర్లు, పట్టణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రోజుకు 150 లీటర్ల తాగునీరు సరఫరా చేసేలా ప్రణాళిక అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న 902 తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని తెలిపారు. తాగునీటి సరఫరా పర్యవేక్షణ అంశం అత్యంత కీలకమైనదని, క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ పకడ్బందీగా జరగాలని సూచించారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తిన వెంటనే యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట చేతిపంపులు, బోరు మోటార్లు, పైప్లైన్ మరమ్మతులు సకాలంలోపూర్తి చేయాలని తెలిపారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, గ్రామ పంచాయతీల పరిధిలో టోల్ ఫ్రీ, కాల్ సెంటర్ నెంబర్లు ప్రజలకు తెలిసేలా ఏర్పాటు చేయాలని, మండలాల పరిధిలో ఉన్న నీటి నిల్వలపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా నిర్ణీత పరిమాణంలో నీరు సరఫరా అవుతోందో లేదో మండలఅధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్ధారించుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ ఈ వేసవిలో ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా నిబద్ధతతో పని చేయాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల గ్రామాలను సందర్శించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యుఎస్ అధికారులు, ఎంపీడీఓలు సమిష్టిగా పని చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన మంచినీటి మరియు పారిశుద్ధ్య కమిటీల ద్వారా నీటి సరఫరా వ్యవస్థను నిశితంగా పరిశీలించాలని సూచించారు. మండలాల ఎంపీఓలు, మిషన్ భగీరథ ఏఈలు మండల స్థాయి బృందాలుగా ఏర్పడి, సర్పంచ్లు, గ్రామ సెక్రటరీలతో కలిసి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్లో గుర్తించి సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, మిషన్ భగీరథ ఈఈ నిర్మల మిషన్ భగీరథ ఈఈ గ్రిడ్ సురేందం పాల్గొన్నారు.

# గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసే దిశగా సమగ్ర ప్రణాళికతో కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. శనివారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇనిస్ట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాత క్యాంపస్ నందు నిర్వహించిన రెండవ విడత నూతన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అశ్వరావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన మొత్తం 233 మంది నూతన సర్పంచులకు 17-02-2026 నుండి 21-02-2026 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడినట్లు కలెక్టర్ తెలిపారు సర్పంచులు పంచాయతీరాజ్ చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, గ్రామస్థాయిలో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు చట్టబద్ధమైన అధికారాలు మరియు బాధ్యతలను సముచితంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమంలో గ్రామపంచాయతీల పరిపాలన విధానం, గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన, బడ్జెట్ నిర్వహణ, ఆర్థిక పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సామాజికాభివృద్ధి, పేదరిక నిర్మూలన తదితర సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలవ్వాలంటే సర్పంచులు నాయకత్వ లక్షణాలతో ముందుండాలని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రాథమిక సదుపాయాల కల్పన, శుద్ధి త్రాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం కార్యాచరణలో పెట్టి, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సర్పంచులందరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న సర్పంచులకు ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు జిల్లా కలెక్టర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐఆర్డీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, ట్రైనర్లు బస్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హజ్రత్ వలి, ఏపీవో రంగ, ఎస్బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువులను మోతాదులోనే వాడాలి

## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నల్లబెల్లి, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): రసాయన ఎరువులను తగు మోతాదులోనే వాడాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రైతులకు సూచించారు. శనివారం నల్లబెల్లి మండలం కొండాయిలపల్లి గ్రామంలో మిర్చి రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ సత్య శారదతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, లేదంటే భూసారం దెబ్బతిని పంటలు పండే పరిస్థితి ఉందన్నారు. మిర్చి సాగు చేసిన రైతులు కోత అనంతరం మార్కెట్ తీసుకువచ్చేటప్పుడు తేమ లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ వ్యవసాయ మార్కెట్ కు రైతులు మిరప తీసుకువచ్చేటప్పుడు శా-స్త్రవేత్తలు సూచించిన విధంగా నాణ్యమైన సరుకును తీసుకు వచ్చినట్లయితే మార్కెట్లో మంచి ధర పలకడానికి, రకాల వారీగా ధరలను కూడా ఎలక్ట్రానిక్ బోర్డుల పైన డిస్ప్లే అయ్యే విధంగా ఏర్పాటు చేస్తారని అన్నారు. రైతులు ధర విషయంలో ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని నాణ్యమైనటువంటి మిర్చిని మార్కెట్ కి తీసుకురావాల్సిందిగా కోరారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ విదేశాలకు ఎగుమతి చేయడానికి పాటించవలసిన నాణ్యత ప్రమాణాల గురించి మరియు మిర్చి ఆరబెట్టేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు అధిక దిగుబడికి రైతులు పాటించవలసిన మేలైన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా జిల్లా యంత్రాంగం మార్కెటింగ్ శాఖ ఉద్యాన శాఖ మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతులు మిర్చిని మార్కెట్లకు తీసుకువచ్చే ముందు సూచనలు పాటించవలసిందిగా కోరనైనది. నాణ్యత ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని మిర్చి బస్తాలను 49 కిలోల లోపు భర్తీ తీసుకు రాగలరు. తేమతో కూడిన మిర్చిని అమ్మకమునకు మార్కెట్కు తీసుకువచ్చినట్లైతే అట్టిమిర్చి రంగు మారి కాయ నాణ్యత లోపిస్తుందని వ్యాపారస్తులు అట్టి మిర్చి కొనుగోలు చేయడానికి నిరాశ వ్యక్తం చేస్తున్నందున అటువంటి మిర్చి సరైన ధర రాక రైతుని ఇబ్బంది పడే అవకాశం ఉన్నందున మిర్చిలో తేమశాతం 10 నుండి 12 శాతం ఉండే విధంగా చూసుకుని తీసుకురావాలి. మీ యొక్క మిర్చి నుండి తాలు మిర్చిని మరియు పండు కాయ వేరు చూసి తీసుకొచ్చినట్లైతే మార్కెట్లో పోటీ ధర పొందవచ్చు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఎరూకల స్వప్న ,జిల్లా వ్యవసాయ అధికారులు అనురాధ, అగ్రికల్చర్ ఆఫీసర్, జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు జిల్లా మార్కెట్ ఆఫీసర్ సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రవీందర్ రెడ్డి మార్కెట్ కమిటీ సభ్యులు, మండల పరిషత్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్, డివిజన్ అగ్రికల్చర్ ఆఫీసర్ దామోదర రెడ్డి ఉద్యాన అధికారి టెక్నికల్ సి రాకేష్, ఉద్యాన అధికారిని జ్యోతి , అగ్రికల్చర్ ఆఫీసర్ రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలలో చైతన్యం వచ్చింది

## మేమెంతో మాకంత

## ఇదే ఐక్యత జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో సత్తా చాటాలి

## మెపా జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల విజేందర్ ముదిరాజ్



హనుమకొండ, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయిస్తున్న బీసీ వెలుగులు మిత్రులకు శ్రేయోభిలాషులకు మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు గతంలో సర్పంచ్ ఎన్నికల్లో ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ అధికారికంగా 17.33శాతం ప్రకటించిన గాని రాష్ట్రవ్యాప్తంగా 52శాతం ఎన్నికల్లో విజయం సాధించినారు అలాగే పట్టణంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో 62శాతం బీసీలు గెలిచారంటే గ్రామీణ ప్రాంతంలో గాని, పట్టణంలో గాని, రాష్ట్రంలో గాని, కేంద్రంలో గాని బీసీలలో చైతన్యం వచ్చిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసిపోయినది. మొత్తం 60 శాతం ఉన్న బీసీలు హక్కుల కోసం ప్రభుత్వంతో మెపా పోరాడుతున్నది అని, మేమెంతో మాకంత అనే నినాదంతో శాంతియు-ఁతంగా పోరాడుతున్నాం. ఇదే ఐక్యత రానున్న జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా బీసీలు సత్తా చాటాలి అని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (మెపా) గోనెల విజేందర్ ముదిరాజ్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఒక ప్రకటనలో విడుదల చేశారు.

# స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసే కుట్ర

## అనుమతులు ఇవ్వకూడదని గ్రామ సర్పంచ్ కి వినతి



శాయంపేట, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): పత్తిపాకలో పెద్దగుట్టకు కొత్తగా స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసే కుట్ర జరుగుతుందని, స్టోన్ క్రషర్ కి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్యకి వినతి పత్రం ద్వారా గ్రామస్తులు తెలియజేయడం జరిగింది. గ్రామంలో గతంలో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసి వాటి బ్లాస్టింగ్ మూలంగా దుమ్ము ధూళి లతో పంట పొలాలు నాశనం అయ్యాయని, ఇల్లు పగుళ్లు పారాయని, అంతేకాకుండా భూగర్భ జలాలు అడుగంటి పోయి ప్రకృతి మొత్తం ధ్వంసం అయి గ్రామం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతుందని తెలిపారు. ఇప్పటికే గ్రామ మొత్తం ప్రమాదం అంచులో ఉందని అన్నారు. ఇదే సందర్భంలో ఇప్పుడు మరొక కొత్త స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసే కుట్ర జరుగుతుందని దీని ఏర్పాటు కు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని గ్రామస్తులు సర్పంచ్ కు తెలియజేశారు. పచ్చని ప్రకృతి వనరులు గుట్టలు విధ్వంసం కాకుండా బాధ్యతాయుతంగా చర్యలు తీసుకొని గ్రామాన్ని సస్యశ్యామలంగా ఉండే విధంగా చొరవ తీసుకోవాలని సర్పంచ్ కి వివరించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా గ్రామంలో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయాలని చూస్తే ఊరుకోమని గ్రామ వనరుల సంక్షేమం కోసం పోరాడుతామని గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జి ఐలయ్య ఉప సర్పంచ్ తుడుం రాజు ఇతర వార్డు సభ్యులు నూతన క్రషర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వమని ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తిపాక గ్రామం వాస్తవ్యుడైన బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, పరుమాండ్ల సురేష్ తిరుపతిరెడ్డి, సాంబ రెడ్డి, రాజేంద్రప్రసాద్, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# సాగు పనిముట్లపై రాయితీ ఇవ్వాలి

## రైతుల పక్షాన అసెంబ్లీలో పోరాడుతామని హామీ

## రైతుబడి అగ్రిషోను సందర్శించిన హరీష్ రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో కొనసాగుతున్న రైతుబడి అగ్రిషోను బీఆర్ఎస్ నేత హరీష్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అగ్రి షో ఎన్నో రకాలుగా దోహదపడుతుందని చెప్పారు. అగ్రి షో వంటి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు ఎంతో మేలు అని అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతను నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు పనిముట్లను రాయితీపై ఇవ్వాలని రైతుల పక్షాన అసెంబ్లీ చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 20న ప్రారంభమైన ఈ వ్యవసాయ ప్రదర్శన 22వ తేదీ వరకూ కొనసాగనుంది. దేశ, విదేశాలకు చెందిన నూతన వ్యవసాయ సాంకేతికతను వివరించేందుకు 500కు పైగా కంపెనీలు ఈ ప్రదర్శనలో స్టాళ్లు ఏర్పాటు చేశాయి. నూతన యంత్రాలు, ఏఐ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, విత్తనాలు, మొక్కలు, ఎరువులు, డ్రిప్ పరికరాల వంటివి ఎన్నో ప్రదర్శనకు వచ్చాయి. మూడు రోజుల్లో పలు అంశాలపై సదస్సులు సైతం జరుగనున్నాయి. సందర్శకులు ముందుగానే ఞఞఞ.తీఝ్రుత్రతీఱంప్ట్రశీష.ఙశీఎ వెబ్ సైట్ ద్వారా టిక్కెట్ బుక్ చేసుకోవచ్చని, అలా చేసుకోలేని వాళ్లు నేరుగా రావచ్చని తెలిపారు.

# పోలీసింగ్‌లో యువత భాగస్వామ్యం




హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): నగర పోలీసులు సరికొత్త నిర్ణయంతో ముందుకొచ్చారు. విద్యావంతులైన యువతలోని సృజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యాన్ని పోలీసింగ్‌లో భాగస్వామ్యం చేసేందుకు 'ఇంటర్న్‌షిప్', 'ప్రొఫెషనల్ వాలంటీర్' ప్రోగ్రామ్‌లను ప్రారంభించారు. దీని ద్వారా అటు విద్యార్థులకు ప్రభుత్వ పరిపాలనపై అవగాహన, ఇటు పోలీస్ శాఖకు నూతన దృక్పథం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

**ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ వివరాలు**

ఈ ప్రోగ్రామ్ ముఖ్యంగా డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థుల కోసం ఉద్దేశించబడింది. 25 ఏళ్ల లోపు వయస్సు ఉండి, ప్రస్తుతం డిగ్రీ లేదా పీజీ చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి డేటా అనాలసిస్, రీసెర్చ్ ప్రాజెక్టులు, ఆధునిక పోలీసింగ్ పద్ధతులకు సంబంధించిన పనులను కేటాయిస్తారు. ప్రోగ్రాంను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు హైదరాబాద్ సిటీ పోలీస్ నుంచి అధికారిక సర్టిఫికెట్ అందజేస్తారు. ఈ ప్రక్రియ అంతా పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో ఎస్ఎమ్ఐటీ సెల్ ద్వారా జరుగుతుంది.

**ప్రొఫెషనల్ వాలంటీర్ ప్రోగ్రామ్**

కేవలం విద్యార్థులే కాకుండా, వివిధ రంగాల్లో నైపుణ్యం ఉన్న నిపుణులు కూడా 'వాలంటీర్'గా చేరి తమ సేవలను అందించవచ్చు. సాంకేతిక లేదా ప్రక్రియ ఆధారిత పనుల్లో వీరు పోలీసులకు సహకరించవచ్చు. ఈ అంశంపై నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ 'విద్యార్థులు పోలీసు అధికారులతో కలిసి పనిచేస్తూ, విభాగపు పనితీరులో సరికొత్త ఆలోచనలను జోడించడానికి ఇదొక చక్కని వేదిక. ఈ కార్యక్రమం ద్వారా అటు విద్యార్థులకు విలువైన అనుభవం, ఇటు పోలీస్ శాఖకు యువత నుంచి నూతన దృక్పథం లభిస్తాయి అని తెలిపారు.

**దరఖాస్తు విధానం**

ఆసక్తి కలిగిన విద్యార్థులు, నిపుణులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. హైదరాబాద్ పోలీస్ అధికారిక వెబ్‌సైట్ ఞఞఞ.ష్ట్రవఎవతీుఝుఎజూశీశ్రీఱఎవ.స్త్రశీఙ.ఱఅ సందర్శించండి. అందులో ఉన్న నిర్దేశిత లింక్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌ను నింపండి. అర్హత ప్రమాణాలు మరియు మార్గదర్శకాలను పూర్తిగా చదివి దరఖాస్తును సమర్పించండి. ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు నేర పరిశోధన, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, సోషల్ మీడియా పోలీసింగ్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవచ్చని హైదరాబాద్ సిటీ పోలీస్ శనివారం ప్రకటనలో తెలిపింది.

# మార్చి 31 నాటికి "రెడ్ టెర్రర్ నుంచి విముక్తి"



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఈ ఏడాది మార్చి 31 గడువు నాటికి దేశం నుండి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని కర్రిగుట్ట కొండల్లో గతేడాది వేసవిలో 21 రోజుల పాటు 45 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య కఠినమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నా మన దళాలు ఒక్క అడుగు కూడా వెనక్కి వేయకుండా 31 మంది మావోయిస్టులను హతమార్చాయన్నారు. అసాధారణ ధైర్యం ప్రదర్శించిన భద్రతాదళాలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. శనివారం ఈశాన్య ప్రాంతంలో తొలిసారిగా జరిగిన 87వ సీఆర్పీఎఫ్ దినోత్సవ పరేడ్‌లో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో రాళ్లదాడుల ఘటనలు జరగడం లేదని, మణిపూర్‌లో జాతి హింస నియంత్రణలో ఉందన్నారు.

**రెడ్ టెర్రర్ నుంచి విముక్తి:**

మావోయిస్టులను సీఆర్పీఎఫ్ గట్టి దెబ్బ కొట్టడంలోనూ సీఆర్పీఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. నక్సలిజం ఒకప్పుడు 12 రాష్ట్రాల్లోని అనేక జిల్లాల్లో వ్యాపించిందని, దానిని నిర్మూలించాలన్న కేంద్ర సంకల్పాన్ని అమలు చేయడంలో సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు అత్యంత కీలక పాత్ర పోషించాయని చెప్పారు. కేవలం మూడు సంవత్సరాల్లో ఈ క్లిష్టమైన లక్ష్యాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు. సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు రెడ్ టెర్రర్ నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో కీలక పాత్ర పోషించాయన్నారు.

# కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

## "రూ 1400 కోట్ల విలువైన భూమి స్వాధీనం"

## మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర

## ఆక్రమణల చెర నుండి పార్కులు, స్థలాలకు విముక్తి




హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): కొండాపూర్‌లో 7 ఎకరాల మేర ఉన్న పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను హైడ్రా శనివారం కాపాడింది. వీటి విలువ రూ. 1400 కోట్ల వరకూ ఉంటుందని హైడ్రా అధికారులు అంచనా వేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సర్వే నంబరు 78 నుంచి 93 లో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 2059 ప్లాట్లతో 1993లో గ్రామపంచాయతీ లే ఔట్ వేశారు. అయితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు కేటాయించారు. అలాగే పాఠశాలకు దాదాపు ఎకరా స్థలం, పార్కుల కోసం ఎకరాకు పైగా కేటాయించారు. పాఠశాలకు కేటాయించిన స్థలంలో 1000 గజాల మేర అపార్టుమెంట్‌ను నిర్మించేశారు. కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాలను కేటాయించారు. ఇలా కేటాయించిన భూములు ఆక్రమణలకు గురౌతున్నాయని, వెంటనే కాపాడి రాజరాజేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న 5 వేల కుటుంబాలకు ఉపయోగపడేలా చూడాలని హైడ్రా ప్రజావాణిలో కాలనీ సంక్షేమ సంఘం కోరింది. ఈ భూముల ఆక్రమణల వెనుక బడాబాబులున్నారని ఫిర్యాదు చేసింది. పలు షోరూంలతో పాటు కిరాణా జనరల్ స్టోర్‌లు వచ్చాయని రహదారులు కూడా ఆక్రమణలకు గురౌతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది.

**దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య**

యూఎల్సీ భూములలోని లే ఔట్ లో ప్లాట్లు ఎల్ఆర్ఎస్ అయ్యాయని, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎల్ఆర్ఎస్ అవ్వకుండా ఆక్రమణదారుల సొంతం ఎలా అవుతాయని ఫిర్యాదు దారులు పేర్కొన్నారు. అవి పార్కులాగాను ప్రజావసరాల స్థలాల గానే ఉపయోగపడాలని హైడ్రాను కోరారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. లే ఔట్ ప్రకారం పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలుగా నిర్ధారించుకుంది. పార్కు స్థలంలో ఇప్పటికే వెయ్యి గజాల మేర అపార్టుమెంట్ రాగా కమ్యూనిటీ స్థలంలో పైవేటు షాపులు, షెడ్డులు వేసినట్టు గుర్తించింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు అక్కడి నివాసితులకే చెందాలనే ఉద్దేశంతో ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. దీంతో రాజరాజేశ్వరి నగర్ నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య హైడ్రాతో పరిష్కారం అయ్యిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

# ఇండ్లను మంజూరు చేయాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని, రాష్ట్రానికి రావాల్సిన ఇండ్లను మంజూరు చేయాలని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌కు విచ్చేసిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. కానీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజూరు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉందని పేర్కొన్నారు.

**మరో 2 లక్షల ఇండ్లను మంజూరు చేయండి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత పీఎంఏవై–జిలో రాష్ట్రం అధికారికంగా చేరిందని రాష్ట్రంలో గత 12 ఏళ్లలో పెరిగిన డిమాండ్ దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది 3 లక్షల ఇళ్లు, వచ్చే ఏడాది మరో 2 లక్షల ఇండ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ విస్తృత సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల డేటాబేస్‌ను ఇప్పటికే సిద్ధం చేసిందని తెలియజేశారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఆవాస్‌2024 మొబైల్ యాప్ ద్వారా మరోసారి సర్వే నిర్వహించి మొత్తం 11.57 లక్షల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. పేదలకు సొంతింటి కలను నెరవేర్చే లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందనే నమ్మకం ఉందన్నారు.



# కాంగ్రెస్‌లో మెరిట్ కోటా తప్ప మరే కోటా లేదు

మొదటి పేజీ తరువాయి



అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు. భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు అని రేవంత్ అన్నారు. రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**షర్మిలపై పొగడ్తలు**

ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వేదికపై రాజకీయ నాటకాలా..?




హైదరాబాద్, ఫిబ్రవరి 21 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ యొక్క సహజ మూర్ఖత్వం కృత్రిమ మేధస్సును మించిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అంతర్జాతీయ వేదికపై రాజకీయ నాటకాలు తగవని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. శనివారం కాంగ్రెస్ పై వరుస ట్వీట్లతో విమర్శలు గుప్పించారు. ఏఐ సమిట్ వద్ద యువజన కాంగ్రెస్ నిరసనపై స్పందిస్తూ యూత్ కాంగ్రెస్ సభ్యులు తమ అల్ప రాజకీయ నాటకాల కోసం ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' ను వేదికగా ఎంచుకోవడం అత్యంత విచారకరం అన్నారు. ఇలాంటి అంతర్జాతీయ వేదికలను నిరసనల కోసం ఉపయోగించడం వల్ల, ప్రపంచ దేశాల ముందు మన దేశం యొక్క ప్రతిష్ట దెబ్బతింటుందన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమే కానీ ఎక్కడ, ఎలా నిరసన తెలపాలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం అని రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేయడానికి ఒక సమయం, సందర్భం ఉంటాయన్నారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' వంటి అంతర్జాతీయ సదస్సు ఖచ్చితంగా ఇలాంటి నిరసనలకు వేదిక కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే ఏఐ సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు ఈ నిరసన చేపట్టడం విచిత్రం అని ఎద్దేవా చేశారు.

## అవిసె గింజలను 30 రోజుల పాటు
# తిని చూడండి..
### శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయో గమనించండి..



అనేక పోషకాలను కలిగిన గింజల్లో అవిసె గింజలు ఒకటి. వీటిని సూపర్ ఫుడ్స్ అని కూడా పిలుస్తారు. ఈ గింజలు అనేక రకాల పోషకాలతో నిండి ఉంటాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ వీటిలో పుష్కలంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడడం, జీర్ణక్రియ పనితీరు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండడం వంటి అనేక ప్రయోజనాలు శరీరానికి అందుతాయి. అవిసె గింజలను క్రమం తప్పకుండా ఒక నెల పాటు తీసుకోవడం వల్ల శరీరంలో కలిగే మార్పుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. అవిసె గింజల వల్ల కలిగే ముఖ్యమైన లాభాల్లో జీర్ణక్రియ మెరుగుపడడం ఒకటి. అవిసె గింజలు ఫైబర్ తో నిండి ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల పేగుల్లో కదలిక ఎక్కువగా ఉంటుంది. మలబద్ధకం సమస్య తగ్గుతుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల క్రమరహిత పేగు నమూనాలతో వచ్చే ఇబ్బందులతో పాటు ఉబ్బరం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి.

#### గుండె ఆరోగ్యానికి..

ప్రతిరోజూ ఒక నెల పాటు అవిసె గింజలను తీసుకోవడం వల్ల హృదయనాళ వ్యవస్థలో గణనీయమైన పెరుగుదల ఉంటుంది. డయాస్టొలిక్, సిస్టోలిక్ ఒత్తిడి తగ్గుతుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. అవిసె గింజల్లో ఉండే ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు, లిగ్నన్స్ అని పిలువబడే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ ప్లాంట్ రసాయనాలు రక్తనాళాల్లో రక్తప్రవాహాన్ని ప్రోత్సహించడంలో సహాయపడతాయి. ఈ గింజలను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడంతో పాటు ధమనుల్లో అడ్డంకులు ఏర్పడకుండా ఉంటాయి. అలాగే డయాబెటిస్ లేదా ప్రీడయాబెటిస్ తో బాధపడే వారు భోజనంలో ఒక చెంచా అవిసె గింజల పొడిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ఒకటి నుండి రెండు నెలల పాటు రోజుకు 10 నుండి 20 గ్రాముల అవిసె గింజల పొడిని తీసుకోవడం వల్ల ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. డయాబెటిస్ తో బాధపడే వారిలో రక్తంలో చక్కెర స్థాయిల్లో వచ్చే హెచ్చుతగ్గులను తగ్గించడంలో అవిసె గింజలు ఎంతో సహాయపడతాయని వైద్యులు చెబుతున్నారు.

#### స్త్రీలలో హార్మోన్ల సమస్యలకు..

అవిసె గింజల్లో మొక్కల నుండి వచ్చే ఈస్ట్రోజన్ లాంటి సమ్మేళనాలు, లిగ్నన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల స్త్రీలలో హార్మోన్లు ఉత్తేజింపబడతాయి. మెనోపాజ్ లక్షణాలను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. స్త్రీలు ఈ గింజలను తీసుకోవడం వల్ల హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. సంతానోత్పత్తి అవకాశాలు మెరుగుపడతాయి. అవిసెగింజలను తీసుకోవడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఈ గింజలు చర్మానికి మాయిశ్చరైజర్‌లా పని చేస్తాయి. చర్మాన్ని మృదువుగా చేయడంలో, జుట్టు కుదుళ్లను బలంగా చేయడంలో, జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో ఈ గింజలు ఎంతో సహాయపడతాయి. అవిసె గింజలను ఒక నెల పాటు తీసుకోవడం వల్ల ఇటువంటి అనేక రకాల ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఈ గింజలు మొత్తం శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతగానో సహాయపడతాయని వీటిని ఆహారంలో భాగంగా తప్పకుండా తీసుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.



## అవకాడోలతో ఎన్నో ఉపయోగాలు..
# ఎలా తీసుకోవాలంటే..?

గుండె ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో అవకాడోలు కూడా ఒకటి. ఇవి క్రీమి టెక్చ్సర్ తో చాలా రుచిగా ఉంటాయి. టోస్ట్, స్మూతీ, సలాడ్ ఇలా ఏ రూపంలో తీసుకున్న కూడా ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. అయితే ఇతర పండ్లల్లో కంటే ఇవి ప్రత్యేకమైనవి అని చెప్పవచ్చు. వీటిలో హృదయనాళ సమతుల్యతను ప్రోత్సహించే బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. అవకాడోలో ఉండే మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో సహాయపడతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలకు మద్దతును ఇస్తాయి. దీనిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, చక్కెర స్థాయిలను నిర్వహించడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి..అవకాడోలో ఉండే పొటాషియం రక్తపోటును తగ్గించడంలో, సోడియం ప్రభావాలను సమతుల్యం చేయడంలో దోహదపడుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి వాపుతో పోరాడడంలో ఉపయోగపడతాయి. అవకాడో గుండె లయకు అవసరమయ్యే ఫోలేట్, మెగ్నీషియంలను కూడా కలిగి ఉంటుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎండోథెలియల్ పనితీరు మెరుగుపడుతుంది. రక్తనాళాలు వ్యాకోచం చెందే సామర్థ్యం పెరుగుతుంది. హృదయనాళ వ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుంది. అవకాడోలను తీసుకోవడం వల్ల రక్తనాళాల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు అడ్డంకులు ఏర్పడడాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన లిపిడ్ ప్రొఫైల్ నిర్వహించడానికి సహాయపడుతుంది.

#### కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

అవకాడోలను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. రక్తప్రవాహం నుండి కొలెస్ట్రాల్ తొలగించబడుతుంది. అవకాడోలను తీసుకోవడం వల్ల గుండె జబ్బులకు కారణమయ్యే ట్రైగ్లిజరాయిడ్ స్థాయిలు కూడా తగ్గుతాయి. కొలెస్ట్రాల్ తో పాటు రక్తపోటును నియంత్రించడంలో కూడా అవకాడో సహాయపడుతుంది. అధిక రక్తపోటు గుండె ఆరోగ్యానికి హానిని కలిగిస్తుంది. అవకాడోలో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వాస్కులర్ రిలాక్సేషన్, స్థిరమైన ప్రసరణను ప్రోత్సహించడంలో సహాయపడతాయి. అవకాడోలో లభించే ఫైటోస్టెరాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో రక్తనాళాల గోడలు దెబ్బతినకుండా ఉంటాయి. ఇలా అనేక రకాలుగా అవకాడోలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

#### ఇలా తీసుకోవచ్చు..

ఇక ఈ అవకాడోలను హోల్‌గ్రెయిన్ టోస్ట్ పై విస్తరించి గుడ్డుతో కలిపి తీసుకోవచ్చు. అలాగే సలాడ్ లలో అవకాడోలను ముక్కలుగా చేసి వేసుకుని తినవచ్చు. అలాగే స్మూతీలను తయారు చేసేటప్పుడు అందులో అవకాడోను వేసి స్మూతీ తయారు చేసి తీసుకోవచ్చు. శాండ్‌విచ్ లను మయోనీస్, బటర్ కు బదులుగా అవకాడోతో తీసుకోవచ్చు.

# ఈ పానీయాలు ఆల్కహాల్ కంటే హానికరం తెలుసా..?



చాలామంది ఆల్కహాల్ మాత్రమే ఆరోగ్యానికి హాని చేస్తుందని అనుకుంటారు. కానీ మనం తీసుకునే పానీయాల్లో కొన్ని ఆల్కహాల్ కంటే ఎక్కువగా ఆరోగ్యానికి హాని తలపెడుతాయి. ముఖ్యంగా కిడ్నీల పనితీరును దెబ్బతీస్తాయి. అయితే ఏ పానీయం ఎక్కువ హాని చేస్తుందో.. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మనం ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.. మన శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు కూడా ఒక భాగం. కిడ్నీలు ఫిల్టర్లుగా పనిచేస్తాయి. అంతే కాదు శరీరం నుంచి వ్యర్థాలు, విషాన్ని తొలగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో తోడ్పడుతాయి. అందుకే మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు శరీరంలో విషపదార్థాలు పేరుకుపోయి అలసట, వాపు, వికారం, శ్వాసలోపం, రక్తహీనత, రక్తపోటు పెరుగుదల, నిద్రలేమి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎందుకంటే కిడ్నీలు శరీరంలోని దాదాపు ప్రతి భాగాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడం శరీర ఆరోగ్యానికి చాలా ముఖ్యం. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే దూరం పెట్టాల్సిన డ్రింక్స్ ఏవో ఇప్పుడు చూద్దాం.. ముఖ్యంగా ఎనర్జీ డ్రింక్స్ కిడ్నీలకు ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని, వాటికి దూరంగా ఉండటం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో ఎనర్జీ డ్రింక్స్ తాగేవారి సంఖ్య పెరుగుతోంది. తరచూ ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడంవల్ల కిడ్నీలు దెబ్బతింటాయి. అంతేకాదు ఈ డ్రింక్స్ కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తాయి. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఎనర్జీ డ్రింక్స్ గురించి హెచ్చరించింది. ఇక మూత్రపిండాల సమస్యలు ఉన్నవాళ్లైతే ఆ ఎనర్జీ డ్రింక్స్ జోలికి అస్సలే వెళ్లకుండా ఉండటం మంచిదని నిపుణులు సలహా ఇస్తున్నారు.

ఎనర్జీ డ్రింక్స్‌ను దూరం పెట్టడంతోపాటు రోజూ కావాల్సిన నీళ్లు తాగడం ద్వారా మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. నిమ్మరసం కూడా మూత్రపిండాల ఆరోగ్యానికి చాలా మంచిదని అంటున్నారు. అల్లం నీరు, హెర్బల్ టీ తాగడం ద్వారా కూడా మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెబుతున్నారు.

# నిమ్మ, నారింజ వంటి పండ్లలోని విత్తనాలను తినవచ్చా..? తింటే ఏమవుతుంది..?

చాలా మంది సాధారణంగా నారింజ, నిమ్మ, ద్రాక్ష వంటి పండ్లను తీసుకుంటూ ఉంటారు. ఇవి పుల్లగా చాలా రుచిగా ఉంటాయి. అలాగే రుచి కోసం నిమ్మరసాన్ని ఇతర ఆహారాల మీద పిండుతూ ఉంటారు. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే ఈ పండ్లన్నీ గింజలను కలిగి ఉంటాయి. సాధారణంగా ఈ గింజలను పడేస్తూ ఉంటారు. కానీ కొన్నిసార్లు అనుకోకుండా ఈ గింజలను మింగేస్తూ ఉంటారు. ఈ గింజలను మింగిన తరువాత గింజలను మింగామే అని భయపడుతూ ఉంటారు. వీటి వల్ల ఏదైనా హాని కలుగుతుందో ఏమో అని భయపడుతూ ఉంటారు. అయితే ఈ గింజలను అనుకోకుండా మింగినా భయపడాల్సిన పని లేదని వైద్యులు చెబుతున్నారు. సిట్రస్ విత్తనాల పైన పొర హానికర సమ్మేళనాలు విడుదల అవ్వకుండా నిరోధిస్తుంది. కనుక వాటిని మింగినా భయపడాల్సిన పని లేదు. అవి జీర్ణం అవ్వకుండా అలాగే మన శరీరం గుండా మలం ద్వారా బయటకు వెళ్లిపోతాయి.



#### పేగుల్లో ఇబ్బందులు..

అలాగే కొందరికి ఈ గింజలను తీసుకోవడం వల్ల ఏమైనా ఉపయోగం ఉందా అని సందేహం వస్తూ ఉంటుంది. అయితే వీటిని తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవని వైద్యులు చెబుతున్నారు. సిట్రస్ పండ్లు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ వాటి గింజలు ఎటువంటి లాభాలను అందించవు కనుక వాటిని తీసుకోకుండా ఉండడమే మంచిది. ఇక ఈ సిట్రస్ గింజలను ఎక్కువ మొత్తంలో తీసుకోవడం వల్ల పేగులకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. వాపుతో పాటు జీర్ణవ్యవస్థలో అసౌకర్యం కలిగే అవకాశం ఉంది. ఈ గింజలకు బయటి పొర గట్టిగా ఉంటుంది కనుక ఇవి జీర్ణం అవ్వకుండా శరీరం గుండా అలాగే బయటకు వెళ్తాయి. ఒకవేళ వీటిని నమలినా, చూర్ణం చేసినా అవి తక్కువ మొత్తంలో హైడ్రోజన్ సైనైడ్ అనే రసాయనాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఈ రసాయనం శరీరం ఆక్సిజన్ ను ఉపయోగించే విధానాన్ని ప్రభావితం చేస్తుంది. వీటిని ఉద్దేశపూర్వకంగా ఎక్కువ మొత్తంలో తీసుకోవడం వల్ల ప్రమాదం కలిగే అవకాశం ఉంది. వికారం, తలనొప్పి, కడుపులో అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తుతాయి.

#### పెద్దలకు ఎలాంటి ప్రమాదం లేదు..

ఈ గింజలను ప్రమాదవశాత్తు తీసుకోవడం వల్ల పెద్దల్లో ఎటువంటి ప్రమాదం కలగదని వైద్యులు చెబుతున్నారు. ఇక సిట్రస్ పండ్లను తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, ఫ్లేవనాయిడ్స్ వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం ఇన్ఫెక్షన్ లతో పోరాడే సామర్థ్యం పెరుగుతుంది. ఈ పండ్లను తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన చర్మాన్ని పొందవచ్చు. కనుక రోజువారి ఆహారంలో భాగంగా సిట్రస్ పండ్లను తీసుకోవడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

## అభిషేక్ శర్మ గురించి టెన్షన్ లేదు

### టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్

టీమిండియా మ్యాచ్ అంటే చాలు స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ డకౌట్ల గురించే చర్చ జరుగుతోంది. అయితే మేనేజ్‌మెంట్ నుంచి అభిషేక్ శర్మకు కావాల్సినంత సపోర్ట్ లభిస్తోంది. అభిషేక్ శర్మ డకౌట్లపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ సరదాగా స్పందించాడు. తాను ఆందోళన చెందుతున్నది అభిషేక్ శర్మ ఫామ్ గురించి కాదని, ప్రత్యర్థి జట్ల గురించి ఆందోళన చెందుతున్నానని తనదైనశైలిలో బదులిచ్చాడు. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో టీమిండియా మొదటి మ్యాచ్ దక్షిణాఫ్రికాతో నేడు తలపడనుంది. మ్యాచ్‌కు ముందు రోజు శనివారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీ20ల్లో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను అభిషేక్ శర్మ పేలవ ఫామ్ గురించి ప్రశ్నలు అడిగారు. అభిషేక్ గ్రూప్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ డకౌట్ అయ్యాడు. అయితే ఓపెనర్ బ్యాటర్ గురించి ఎలాంటి ఆందోళన లేదని, కానీ ప్రత్యర్థి జట్ల గురించి తనకు ఆందోళనగా ఉందని కెప్టెన్ సూర్య పేర్కొన్నాడు. 'అభిషేక్ శర్మ ఫామ్ గురించి ఆందోళన చెందుతున్న వారిని చూసి నేను ఆందోళన చెందుతున్నాను. అభిషేక్ శర్మ భవిష్యత్తులో ఎవరితో ఆడబోతున్నాడో ఆ జట్ల గురించి ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో అతనిని ఎదుర్కోబోయే జట్ల గురించి ఎక్కువ ఆందోళనగా ఉన్నారు. గత సంవత్సరం అభిషేక్ చాలా చేశాడు. ఇప్పుడు అతనికి మేం సహకరించాల్సిన సమయం వచ్చింది' అని సూర్య మద్దతుగా నిలిచాడు. ప్రతి మ్యాచులో 250 పరుగులు చేయాల్సిన అవసరం లేదని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. వికెట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయని ఆయన చెప్పారు. తదుపరి మ్యాచ్‌లలో వచ్చే పిచ్ సవాళ్లను తాము ఎదుర్కొంటామని తెలిపారు. భారత్ నెదర్లాండ్స్‌పై ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలోనే విజయం సాధించింది, ఇప్పుడు దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్ కూడా అక్కడే జరగనుంది. ప్రస్తుత ఎడిషన్‌లో దక్షిణాఫ్రికా కూడా ఈ గ్రౌండ్‌లో 2 మ్యాచ్‌లు ఆడి రెండింటిలోనూ విజయం సాధించింది. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరగనుంది. నెదర్లాండ్స్ మ్యాచులో అభిషేక్ వరుసగా మూడవసారి డకౌట్ అయ్యాడు. అంతకుముందు పాకిస్తాన్, అమెరికాలపై కూడా ఖాతా తెరవలేదు. ఇప్పటివరకు టోర్నీలో ఓడిపోనప్పటికీ, ఇకనుంచి అభిషేక్ పరుగులు చేయడం జట్టుకు అవసరం. కానీ తన ఆటగాడికి కెప్టెన్ నుంచి సపోర్ట్ లభించింది.

### దక్షిణాఫ్రికాపై భారత్ ప్లేయింగ్ 11 అంచనా

అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా.

# అసలైన సమరానికి తెర

### నేడు భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య సూపర్-8 పోరు

### అభిషేక్ శర్మ స్థానంలో జట్టులోకి సంజూ శాంసన్!



టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన అసలైన సమరానికి తెరలేచింది. ఆదివారం (ఫిబ్రవరి 22) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, సౌతాఫ్రికా జట్లు సూపర్-8 పోరులో తలపడనున్నాయి. గత టీ20 వరల్డ్ కప్ ఫైనలిస్టుల మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్ అంటే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా తుది జట్టు (గ్రాశ్రీఖఎఅఅస్త్ర-11) విషయంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో సున్నాకే అవుట్ కావడంతో, అతని స్థానంలో సంజూ శాంసన్‌ను తీసుకుంటారా అన్న సందేహాలు మొదలయ్యాయి. శుక్రవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో సంజూ శాంసన్ నెట్స్‌లో చాలా సేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో, అతను తుది జట్టులోకి వస్తున్నాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. సాధారణంగా మ్యాచ్‌కు ముందు ఎవరైతే ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తారో, వారు ప్లేయింగ్-11లో ఉండే అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందు ఉంచగా, ఆయన చాలా ఆసక్తికరంగా స్పందించారు. "ఏంటి.. సంజూను ఆడించడం కోసం అభిషేక్ శర్మను తప్పించమంటారా? లేక నంబర్-3లో ఆడుతున్న తిలక్ వర్మను పక్కన పెట్టమంటారా?" అంటూ ఎదురు ప్రశ్న వేశారు. దీన్ని బట్టి చూస్తుంటే, టీమ్ మేనేజ్మెంట్ అభిషేక్ శర్మపైనే పూర్తి నమ్మకంతో ఉన్నట్లు అర్థమవుతోంది. జట్టు ప్రదర్శనపై వస్తున్న విమర్శలను కూడా సూర్య సున్నితంగా తిప్పికొట్టారు. "ప్రస్తుతం అంతా బాగానే ఉంది. పవర్‌ప్లేలో 40-50 పరుగులు వస్తున్నాయి. మనం ద్వైపాక్షిక సిరీస్‌లలో భారీ స్కోర్లు సాధించడంతో అందరిలో అంచనాలు పెరిగిపోయాయి. ప్రతి మ్యాచ్‌లోనూ 220-240 పరుగులు చేయాలని ఆశించడం సహజమే. కానీ ఇక్కడి వికెట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయి. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ పరిస్థితులు వేరుగా ఉన్నాయి, వాటికి తగ్గట్టే మేము ఆడుతున్నాం అని సూర్య చెప్పుకొచ్చారు. ఓపెనింగ్ జోడీలో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కొనసాగే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌లో తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్,

శివమ్ దూబే బలాన్ని ఇస్తారు. బౌలింగ్ విభాగంలో వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ మధ్య పోటీ ఉన్నప్పటికీ.. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కే మొగ్గు ఎక్కువగా ఉంది. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న అక్షర్, ఇప్పుడు కీలకమైన సౌతాఫ్రికా మ్యాచ్‌లోకి నేరుగా వచ్చే అవకాశం ఉంది. వరుణ్ చక్రవర్తి స్పిన్ అమ్ములపొదిలో కీలక అస్త్రంగా మారగా, బుమ్రా-అర్షదీప్ పేస్ భారాన్ని మోయనున్నారు.

## ఇషానీ జోహార్‌తో విడాకులు తీసుకున్న రాహుల్ చాహర్

భారత క్రికెటర్ రాహుల్ చాహర్, తన భార్య ఇషానీ జోహార్‌తో విడాకులు తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. సుదీర్ఘ కాలం పాటు కొనసాగిన వీరి వివాహ బంధం ముగియడంపై రాహుల్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. గత కొద్ది కాలంగా వ్యక్తిగత జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారత స్పిన్నర్ రాహుల్ చాహర్, తన వైవాహిక బంధానికి ముగింపు పలికారు. ఫ్యాషన్ డిజైనర్ అయిన ఇషానీ జోహార్‌తో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రాహుల్ తన విడాకుల నిర్ణయం గురించి ఓ సందేశాన్ని పంచుకున్నారు. "నేను చాలా చిన్న వయసులోనే పెళ్లి చేసుకున్నాను. అప్పట్లో నన్ను నేను, నా విలువలను, జీవితం వైపు నా దిశను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను" అని రాహుల్ పేర్కొన్నారు. గత 15 నెలలుగా కోర్టు ప్రక్రియల ద్వారా వెళ్తున్న సమయంలో సహనం, నిజాయితీ ప్రాముఖ్యతను తెలుసుకున్నట్లు ఆయన వివరించారు. "నేను ఈ బంధాన్ని కోపంతోనో, విచారంతోనో ముగించడం లేదు. పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతున్నాను. కొన్ని సంబంధాలు కేవలం మనకు జీవిత పాఠాలు నేర్పడానికే వస్తాయి" అని రాహుల్ రాసుకొచ్చారు. ఈ విడాకులను ఒక ముగింపుగా కాకుండా కొత్త ప్రారంభంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆత్మగౌరవం, ప్రశాంతత, భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగుతానని, తన మనసులో ఎలాంటి చేదు అనుభవాలను ఉంచుకోవాలని అనుకోవడం లేదని స్పష్టం చేశారు. రాహుల్ – ఇషానీ బంధం నేపథ్యం.. 2019లో జైపూర్ వేదికగా రాహుల్, ఇషానీ నిశ్చితార్థం జరిగింది. ఆ తర్వాత 2022లో వీరిద్దరూ ఒక్కటయ్యారు. సుమారు నాలుగు ఏళ్ల సహజీవనం (నిశ్చితార్థం నుండి) తర్వాత వీరు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. మార్చి 9న వీరి వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సి ఉండగా, అంతకంటే ముందే చట్టపరంగా విడిపోయారు.



## పాకిస్థాన్ మాయలో పడి నవ్వుల పాలయ్యాం

### బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మాజీ అధికారి ఆవేదన!

టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోవడంపై ఆ దేశ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ మాటలు నమ్మి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చారిత్రాత్మక తప్పిదం చేసిందని సీనియర్ క్రికెటర్లు అంటున్నారు. దాని వల్ల జట్టు 2026 టీ20 ప్రపంచకప్ ఆడే అవకాశాన్ని చేజార్చుకుందని బీసీబీ మాజీ జనరల్ సెక్రటరీ సయ్యద్ అస్రాఫుల్ హక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ వేసిన పన్నాగంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ అమీనుల్ ఇస్లామ్ చిక్కుకున్నారని సయ్యద్ అస్రాఫుల్ హక్ ఆరోపించారు. "పీసీబీ ఛైర్మన్ నఖ్వీ మాయమాటలకు మా బోర్డు చీఫ్ అమీనుల్ ప్రభావితమయ్యారు. అమీనుల్ అమాయకత్వం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారు, కానీ ఫలితంగా మనం ప్రపంచకప్‌కు దూరమయ్యాం" అని సయ్యద్ విమర్శించారు. గతంలో జగన్మోహన్ దాల్మియా హయాంలో బంగ్లాదేశ్ క్రికెట్‌కు భారత్ నుంచి ఎంతో గౌరవం, మద్దతు లభించేవని ఆయన గుర్తు చేశారు. భారత క్రికెట్ బోర్డుతో సత్సంబంధాలు అవసరమని, కానీ ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాలు భారత్‌కు వ్యతిరేకంగా ఉండటం వల్ల మనం నవ్వులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌లో భద్రతా సమస్యలు ఉన్నాయన్న సాకుతో మ్యాచులను శ్రీలంకకు మార్చాలని కోరడం సరైన కారణం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్ వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో తమ జట్టుకు భద్రతా పరమైన ముప్పు ఉందని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఆందోళన వ్యక్తం చేసింది. తమ మ్యాచులను తటస్థ వేదిక అయిన శ్రీలంకలో నిర్వహించాలని ఐసీసీని కోరింది. అయితే, భారత్‌లో భద్రతా ప్రమాణాలు అత్యున్నతంగా ఉన్నాయని గుర్తించిన ఐసీసీ, బంగ్లాదేశ్ కోరికను తిరస్కరించింది. దీంతో బంగ్లాదేశ్ ఈ మెగా టోర్నీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంది. బంగ్లాదేశ్ తప్పుకోవడంతో ఆ జట్టు స్థానాన్ని ఐసీసీ స్కాట్లాండ్‌కు కేటాయించింది. మరోవైపు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుతో చర్చల అనంతరం, టోర్నీ నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్‌పై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు లేదా ఆంక్షలు విధించబోమని ఐసీసీ ప్రకటించింది. పాకిస్థాన్ జిత్తులకు బంగ్లాదేశ్ చిత్తయ్యిందని, క్రికెట్ పరిపాలనలో దౌత్యపరమైన వైఫల్యం వల్ల ఆటగాళ్లు, అభిమానులు భారీ మూల్యం చెల్లించుకున్నారని సయ్యద్ అస్రాఫుల్ హక్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## ఇకపైనే టీమిండియాకు సిసలైన పోటీ

టీ20 ప్రపంచ కప్‌లో అసలైన పోరుకు రంగం సిద్ధమైంది. 20 జట్లతో ప్రారంభమైన టోర్నమెంట్?లో 8 టీమ్స్? మిగిలాయి. ఈ ఎనిమిది జట్ల మధ్య శనివారం నుంచి సూపర్ 8 పోరు షురూ కానుంది. గ్రూప్? దశలో భారత్ ఓటమి లేకుండా నాలుగు మ్యాచ్?ల్లోనూ నెగ్గి తదుపరి దశకు రెడీ అవుతోంది. అయితే ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా పాకిస్థాన్ మినహా బలమైన జట్టును ఢీ కొట్టలేదు. కానీ, ఇకపైనే టీమ్ఇండియాకు సిసలైన పోటీ ఉండనుంది. సూపర్ 8లో వెస్టిండీస్, సౌతాఫ్రికా లాంటి పటిష్ఠమైన జట్లను ఢీ కొట్టాల్సి ఉంది. మొత్తం ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించి సూపర్ 8 మ్యాచ్?లు నిర్వహిస్తున్నారు. ఇందులో భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే ఒక గ్రూప్?లో ఉండగా, శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్థాన్, ఇంగ్లాండ్ ఇంకో గ్రూపులో ఉన్నాయి. ఇందులో ఒక్కో గ్రూప్?లోని జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ (మొత్తం 3 మ్యాచ్?లు) ఆడుతుంది. అలా మ్యాచ్?లు ముగిసేసరికి రెండు గ్రూపుల్లోని టాప్ 2 జట్లు సెమీఫైనల్?కు అర్హత సాధిస్తాయి. అక్కడ నెగ్గిన జట్లు ఫైనల్?కు చేరుకుంటాయి. ఫిబ్రవరి 22 ఆదివారం భారత్ సూపర్ 8లో తొలి మ్యాచ్ ఆడనుంది. ఇందులో సౌతాఫ్రికాను ఎదుర్కోనుంది. ఈ మ్యాచ్?కు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికకానుంది. సాయంత్రం 7 గంటలకు మ్యాచ్? మొదలవుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 26 గురువారం చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జింబాబ్వేతో భారత్ రెండో మ్యాచ్ ఆడనుంది. దీని తర్వాత మార్చి 1 ఆదివారం వెస్టిండీస్‌తో చివరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఈ పోరుకు కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్? ఆతిథ్యం ఇవ్వనుంది.అయితే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా సెమీస్?కు దూసుకెళ్లాలంటే భారత్ మూడు మ్యాచ్?ల్లోనూ నెగ్గాలి. అప్పుడు ఎలాంటి సమీకరణాలు లెక్కలేసుకోకుండా నేరుగా సెమీస్?కు వెళ్లొచ్చు. ఇక ఒక మ్యాచ్?లో ఓడిపోయి, రెండింట్లో విజయం సాధించినా అవకాశం ఉంటుంది. అప్పుడు, ఇతర జట్ల ఫలితాలు అలాగే రన్?రేట్ కీలకం అవుతుంది. రేస్?లో ఉన్న జట్లతో పాయింట్లు సమానంగా ఉంటే, మెరుగైన రన్?రేట్ కలిగిన టీమ్ ముందడుకు వేస్తుంది. అందుకే ఓటమి అంతరం ఎక్కువగా ఉండకుండా చూసుకోవడమూ ముఖ్యమే! ఒకవేళ రెండు మ్యాచ్?ల్లో ఓడిపోయి ఒకదాంట్లో నెగ్గినట్లైతే దాదాపు సెమీస్?కు దారులు మూసుకుపోతాయి. అందుకే రెండు మ్యాచ్?ల్లో విజయం తప్పనిసరి! నెట్? రన్?రేట్ మెరుగుపర్చుకుంటూ కనీసం రెండింట్లో గెలిస్తే సూర్య సేన సెమీఫైనల్?కు అర్హత సాధిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సూపర్ 8 గ్రూప్ 1లో ఉన్న జింబాబ్వే, సౌతాఫ్రికా, వెస్టిండీస్, భారత్ మధ్య ఓ ఆసక్తికర అశం ఉంది. అదేంటంటే? ఈ నాలుగు జట్లు కూడా గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్?లోనూ ఓడిపోకుండా ఇక్కడి దాకా వచ్చాయి. సౌతాఫ్రికా, వెస్టిండీస్, భారత్ మూడు జట్లు నాలుగేసి విజయాలు సాధిస్తే, జింబాబ్వే మూడింట నెగ్గింది. ఒక మ్యాచ్ రద్దైంది. అందుకే సూపర్ 8లో భారత్?కు ప్రత్యర్థుల నుంచి గట్టి పోటీ ఉండనుంది. అలాగే ఈ కీలకమైన దశకు ముందు టీమ్ఇండియా బౌలర్ మహ్మద్ సిరాజ్ గాయపడడం ఆందోళన కలిగిస్తుంది. తొలి మ్యాచ్?కు రేపటిదాకా సమయం ఉంది కాబట్టి అప్పటిలోగా అతడు కోలుకోవాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

## ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత్

### 2-1తో ద్వైపాక్షిక సిరీస్ కైవసం !

### రాణించిన టీమిండియా మహిళలు

ఆస్ట్రేలియా గడ్డపై భారత మహిళల క్రికెట్ జట్టు అద్భుతం సృష్టించింది. అడిలైడ్ ఓవల్ వేదికగా శనివారం జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాపై 17 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుని దశాబ్దాల చరిత్ర తిరగరాసింది. దాదాపు పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో ద్వైపాక్షిక సిరీస్ గెలవడం విశేషం. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 176 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా జట్టును మన బౌలర్లు తీవ్రంగా ఒత్తిడికి గురిచేశారు. కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ఆసీస్ జట్టు 20 ఓవర్లు ముగిసేసరికి తొమ్మిది వికెట్లు కోల్పోయి కేవలం 159 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు సమిష్టి కృషితో సాధించిన ఈ అద్భుతమైన విజయం పట్ల దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. భారత బ్యాటింగ్ ఇన్నింగ్స్‌లో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, యువ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వీరవిహారం చేశారు. ఆరంభంలోనే షఫాలీ వర్మ వికెట్ కోల్పోయిన దశలో ఈ ఇద్దరూ కలిసి ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. స్మృతి మంధాన కేవలం 55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో చెలరేగి 82 పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించింది. మరోవైపు జెమీమా రోడ్రిగ్స్ కూడా ఎంతో ధాటిగా ఆడుతూ 46 బంతుల్లో 59 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు అత్యంత కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో భారత్ భారీ స్కోరు దిశగా పయనించింది. ఆఖర్లో వరుస వికెట్లు పడినప్పటికీ, వీరిద్దరి మెరుపు ఇన్నింగ్స్‌లే టీమిండియా చారిత్రక విజయానికి బలమైన పునాది వేశాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు భారత బౌలర్లు ఆరంభంలోనే కోలుకోలేని షాక్ ఇచ్చారు. యువ స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి తమ స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. పవర్ ప్లే లోనే ఆస్ట్రేలియా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి మ్యాచ్‌ను మన ఆధీనంలోకి తెచ్చారు. ఆస్ట్రేలియా బ్యాటర్లలో ఆష్లీ గార్డ్‌నర్ (57 పరుగులు) మాత్రమే ఒంటరి పోరాటం చేసింది. మిగతా ఎవరూ పెద్దగా రాణించకపోవడంతో ఆసీస్ పరాజయం పాలైంది. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ 3 వికెట్లు పడగొట్టగా, శ్రీ చరణి కూడా 3 వికెట్లు తీసుకుని సత్తా చాటింది. పేసర్ అరుంధతి రెడ్డి 2 వికెట్లు తీసి తన వంతు సహకారం అందించింది. వన్డే సిరీస్, టెస్ట్ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా లాంటి బలమైన జట్టును వాళ్ల సొంతగడ్డపై మట్టికరిపించడం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుతుంది.



